www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 16 అక్టోబర్ 2024

వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ పర్యటన

వార్డులను పరిశీలిస్తున్న కమిషనర్

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య పట్టణంలోని 26వ వార్డులో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలకు గుంపునకు గురైన ప్రాంతాల్లో నిలిచిన నీరు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆదర్శనగర్, ఇందిరా కాలనీ, వైఎస్ఆర్ కాలనీ వంటి లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి ప్రజలు అసౌకర్యానికి గురవ్వకుండా శాశ్వత పరిష్కారం కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా శానిటరీ, ఇంజినీరింగ్, ప్లానింగ్ సిబ్బందికి తగు సలహాలు ఇచ్చారు.

చి'వరి'లో వర్రీ..!

అన్నదాత తీవ్ర ఆందోళనకు గురవుతున్నాడు. అల్పపీడన ప్రభావంతో జిల్లాలో కురుస్తున్న వర్షాలు, వాతావరణంలో మార్పులు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుపానుగా మారనున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు రైతుల్లో తీవ్ర అలజడి సృష్టిస్తున్నాయి.

అల్పపీడన ప్రభావంతో వర్షాలు

తుపాను హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన

రెండు జిల్లాల్లో దాదాపు 4.50 లక్షల ఎకరాల్లో వరిసాగు

పంటంతా పొట్ట, ఈనిక దశలోనే

మెట్ట ప్రాంతంలో మొదలైన వరి మాసూళ్లు

ప్రస్తుత ఖరీఫ్‌లో రెండుసార్లు రైతులకు కోలుకోలేని దెబ్బ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు 4.50 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. భారీ వర్షాలకు ప్రస్తుత ఖరీఫ్‌లో ఇప్పటికే రెండుసార్లు రైతులు పంట నష్టపోయారు. జులైలో విరుచుకుపడిన వరదలకు పశ్చిమ, ఏలూరు జిల్లాల్లో 13,307 ఎకరాల్లో రైతులు వరిపంట కోల్పోయారు. రైతులకు రూ.11 కోట్లు పరిహారం అందించాలని అధికారులు తేల్చారు. ఆగస్టు మొదటివారంలో విరుచుకుపడిన వరదలకు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 16,030 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. మొత్తం రూ.16 కోట్లు పరిహారం ఇవ్వాలని అధికారులు ప్రభుత్వానికి నివేదించగా, ప్రభుత్వం ఆ సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేసింది. పంట నష్టం నమోదులో 33 శాతం నిబంధన అన్నదాతకు పరిహారం అందకుండా చేసిన పరిస్థితి నెలకొంది. వాస్తవానికి రెండు జిల్లాల్లో పెద్దఎత్తున పంట నష్టం జరిగింది. నిబంధనల పేరుతో చాలామంది రైతులకు పంట నష్టపరిహారం అందలేదు. వరదలకు, వర్షాలకు నష్టపోగా మిగిలిన పంటను రైతులు ఎన్నో కష్టాలకోర్చి చివరి దశకు తెచ్చారు. ప్రస్తుతం మెట్ట ప్రాంతంలో ముందుగా వరి సాగు చేసిన

తాడేపల్లిగూడెం, ఉంగుటూరు వంటి మండలాల్లో వరి మాసూళ్లు ప్రారంభమయ్యాయి. డెల్టాలో మాత్రం వరి పంటంతా పొట్ట, ఈనిక దశలోనే ఉంది. ఇప్పటికే ఎకరాకు రూ.20 వేలకుపైగా రైతులు పెట్టుబడులు పెట్టారు. మరో నెల రోజుల్లో పంట చేతికొచ్చే తరుణంలో తుపాను హెచ్చరికలతో రైతులు తీవ్రంగా కలత చెందుతున్నారు. ఇప్పటికే రెండుసార్లు విరుచుకుపడిన భారీవర్షాలు, వరదలకు జిల్లా రైతాంగం తీవ్ర నష్టాలను చవిచూసింది. పంట చివరి దశలో ఉన్న తరుణంలో ఏదైనా ప్రకృతి విపత్తు సంభవిస్తే తీవ్ర నష్టాన్ని రైతులు చూడాల్సి ఉంటుంది. రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు కురవనున్నాయనే హెచ్చరికలతో అన్నదాత తీవ్ర భయాందోళనకు గురవుతున్నాడు.

కోలుకోలేని స్థితిలో కౌలురైతు

రెండు జిల్లాల్లో వ్యవసాయ సాగు 70 శాతానికిపైగా కౌలు రైతులే చేస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వం కౌలుచట్టంలో చేసిన మార్పులతో కౌలుకార్డులుగాని, బ్యాంకుల నుంచి పంటరుణాలుగాని కౌలురైతులకు సక్రమంగా అందని దుస్థితి నెలకొంది. దీంతో ప్రయివేటు వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి రైతులు పెట్టుబడులు పెట్టారు. ఐదెకరాలు సాగు చేసిన రైతు ఇప్పటికే తక్కువగా లెక్కించినా రూ.లక్షకుపైగా అప్పు తెచ్చి పెట్టుబడి పెట్టిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఏదైనా తేడా వస్తే కౌలురైతుల పరిస్థితి అత్యంత దారుణంగా మారనుంది. ఇప్పటికే రెండుసార్లు పంట దెబ్బతిని కోలుకోలేని స్థితిలోకి కౌలురైతులు చేరుకున్నారు. దీంతో మరోసారి తుపాను హెచ్చరికలు కౌలురైతుల గుండెల్లో గుబులు రేపుతున్నాయి. పంట దెబ్బతింటే పంట నష్టపరిహారం, బీమా సైతం కౌలురైతులకు అందడం లేదు. పెట్టుబడి పెట్టని భూయజమానుల జేబుల్లోకి చేరుతున్నాయి. తుపాను సంభవిస్తే పొట్ట దశలో ఉన్న పొలాలు తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉంది. తుపాను గండం నుంచి పంట గట్టెక్కుతుందా.. లేదా అనే ఆందోళన రైతుల్లో నెలకొంది.

జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా..

గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి


గొట్టిపాటి రవికుమార్

నాదెండ్ల మనోహర్

పశ్చిమగోదావరి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నియమితులయ్యారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటి వరకూ ఇన్‌ఛార్జి మంత్రులను నియమించలేదు. దీంతో ఆయా జిల్లాలకు చెందిన మంత్రులే కీలక పాత్ర పోషిస్తున్నారు. జిల్లా సమీక్షా సమావేశాల్లో జిల్లాకు చెందిన మంత్రులు పాల్గొని అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. జిల్లాలకు ఇన్‌ఛార్జి మంత్రులను నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అభివృద్ధి పనులకు సంబంధించి నిధుల మంజూరులో ఇన్‌ఛార్జి మంత్రి పాత్ర కీలకం. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉంటే సమస్యలు త్వరితగతిన పరిష్కారమయ్యే అవకాశం ఉంటుంది. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన మంత్రి నిమ్మల రామానాయుడుని తూర్పుగోదావరి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమించారు.

ఏలూరు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా నాదెండ్ల మనోహర్

ఏలూరు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నియమితులయ్యారు. పౌర సరఫరాల శాఖకు చెందిన మంత్రి మనోహర్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా నియమితులవ్వడంతో రైతుల సమస్యలు త్వరితగతిన పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఏలూరు జిల్లాకు చెందిన సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథిని బాపట్ల జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా నియమితులయ్యారు.

గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలి

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ఉపాధి హామీ పనులు ఎక్కువ మొత్తంలో చేపట్టి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. కొమరాడలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ నిధులు రూ.80 లక్షల వ్యయంతో రెండు సీసీ రోడ్ల నిర్మాణానికి ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) శంకుస్థాపన చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి అర్హులైన ప్రతిఒక్కరికీ ఉపాధి హామీ పనులను పెద్దఎత్తున కేటాయించాలన్నారు. జిల్లాలో సుమారు రూ.51 కోట్ల విలువ కలిగిన 423 పనులను చేపడతామన్నారు. ఉపాధి హామీ నిధుల ద్వారా గ్రామాల్లో రోడ్ల సమస్య తీరనున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ పనుల ద్వారా వచ్చే మెటీరియల్ కాంపోనెంట్ గతంలో 30 శాతం ఉండేదని, ఇప్పుడు దానిని 40 శాతానికి పెంచినట్లు తెలిపారు. ఎంఎల్ఎ అంజిబాబు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనులు పెద్దఎత్తున చేపట్టాలని సూచించారు. దీని ద్వారా వచ్చే మెటీరియల్ కాంపోనెంట్‌తో రోడ్లు వంటి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. కచ్చా డ్రెయిన్లు, బోదెలు, మురుగు కాలువలు ఉపాధి హామీ పనుల ద్వారా బాగుచేసుకోవాలని సూచించారు. గత ప్రభుత్వంలో పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాలు సుమారు కిలోమీటర్ దూరంలో ఉండటంతోపాటు స్థలానికి చేరుకోవడానికి మార్గం ఇబ్బందిగా ఉండటం, సుమారు 10, 15 అడుగులు లోతుగా ఉండటం, నిర్మాణాలకు అనువుగా లేని కారణంగా ఈ స్థలాలను రద్దు చేసి వేరే చోట స్థలాల మంజూరుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. రైతులు పంట పొలాలకు వెళ్లాలంటే గ్రామంలో ఉన్న నాలుగు పుంత రోడ్లు మట్టితో ఉన్నాయని, అవి పాడైపోయి రాకపోకలకు చాలా ఇబ్బందిగా ఉందని నిర్మాణాలు చేపట్టాలని గ్రామస్తులు కలెక్టర్‌ను కోరారు. గ్రామంలో తరచూ కరెంటు తీగలు తెగిపోవడం, స్తంభాలు కూలిపోవడం జరుగుతున్నాయని, వీటి కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని, కరెంటు లైన్లు మార్చాలని కోరారు. పాఠశాల భవనం చాలా పాతదైపోయిందని, కొత్తది నిర్మించాలని కోరారు. గ్రామంలో రెండు అంగన్వాడీ కేంద్రాలు ఉండగా ఒక అంగన్వాడీ కేంద్రాన్ని ప్రయివేటు అద్దె భవనంలో నిర్వహిస్తున్నామని, పంచాయతీ స్థలం ఖాళీగా ఉన్నందున ఆ స్థానంలో నిర్మాణం చేపడితే బాగుంటుందని సూచించారు. రాయలం డ్రెయిన్ బ్యాక్‌వాటర్ కారణంగా ఇబ్బంది పడుతున్నామని, రెగ్యులేటర్ నిర్మాణం చేపట్టాలని కోరారు. కొత్తగా వేసిన సిమెంటు రోడ్డుకి లింకు రోడ్డు మధ్య కలపకుండా ఖాళీగా వదిలేయడంతో ప్రమాదాలకు గురవుతున్నారని, వాటిని కలపడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఓవర్ హెడ్‌ట్యాంక్ నిర్మాణానికి రూ.1.20 కోట్లు నిధులు మంజూరయ్యాయని, స్థలం లేదని నిర్మాణం చేపట్టలేదని, చెరువుగట్టు వద్ద ఉన్న స్థలాన్ని పరిశీలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ కెసిహెచ్.అప్పారావు, హౌసింగ్ ఇఇ బి.వెంకటరమణ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి కె.శ్రీనివాసరావు, కొమరాడ సర్పంచి రాట్నాల వీరయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు రాట్నాల సత్యనారాయణస్వామి, మాణిక్యాలరావు, మండల స్థాయి అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపీమూర్తి ప్రచారం

ప్రజాశక్తి - భీమవరం

మాట్లాడుతున్న గోపీమూర్తి

ఉభయగోదావరి జిల్లాల పిడిఎఫ్ టీచర్స్ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపీమూర్తి బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. ఆకివీడు, గణపవరం మండలాల్లో జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆకివీడు మండలంలో చెరుకుమిల్లి, ఆకివీడుల్లో బాలురు, బాలికల జిల్లా పరిషత్ పాఠశాలలు, పెదకాపవరం, చినకాపవరంల్లో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలు, గణపవరం మండలంలో గణపవరంలో బాలుర, బాలికల జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలు, అర్ధవరం, పిప్పర పాఠశాలల్లో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను గోపీమూర్తి కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లావ్యాప్తంగా ఎంఎల్‌సి అభ్యర్థి గోపీమూర్తి అన్ని పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల మద్దతు కోరుతున్నారు. రాబోయే రోజుల్లో జరగబోయే ఎంఎల్‌సి ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యతా ఓటు తనకు వేసి గెలిపించాలని కోరుతూ ప్రచారం చేస్తున్నారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులతోపాటు సామాన్య ప్రజానీకం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. శాసనమండలిలో ప్రజా గొంతు వినిపించి సమస్యల పరిష్కారానికి కృషి చేసే అవకాశం తనకు కల్పించాలని కోరారు. ఆయన వెంట యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, యుటిఎఫ్ నేతలు, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఉన్నారు.

గణపవరం: తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న బొర్రా గోపీమూర్తి మంగళవారం మండలంలో హైస్కూళ్లు, కళాశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ రానున్న కాలంలో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి జరిగే పోరాటాల్లో అండగా నిలుస్తానన్నారు. ఉపాధ్యాయులకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తానన్నారు. ఉపాధ్యాయులు, అధ్యాపకుల ఆందోళనలు, పోరాటాల్లో ప్రత్యక్షంగా తోడుగా నిలుస్తానన్నారు. కీర్తిశేషులు, ఎంఎల్‌సి షేక్ సాబ్జీ వారసునిగా గోపీమూర్తిని మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపిస్తామని పలువురు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నేతలు జె.నాని, జి.భగవాన్ ప్రసాద్, వోతా ఆంజనేయులు, ఎం.వెంకటేశ్వర్లు, శర్మ, నాగ సత్యనారాయణ, ఎ.అపర్ణ పాల్గొన్నారు.

భూయజమానులు రీసర్వేకు సహకరించాలి

జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో రీసర్వే జరగనున్న గ్రామాల్లో భూయజమానులు అధికారులకు సహకరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి కోరారు. జిల్లాలో 293 గ్రామాల్లో రీసర్వే చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 174 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశామని తెలిపారు. 174 గ్రామాల్లో సర్వే, బౌండరీ యాక్ట్ 1923 ప్రకారం సర్వే నిర్వహించి ఆర్ఓఆర్ (రికార్డ్స్ ఆఫ్ రైట్స్) ప్రకారంగా భూ యజమానులకూ నిర్ణయించినట్లు చెప్పారు. ఈ రికార్డులు జిల్లాలో అన్ని గ్రామ పంచాయతీల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీటిపై సంబంధిత భూయజమానులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే రీసర్వే గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. జిల్లాలో రీసర్వే గ్రామసభలు ఈ నెల 18వ తేదీ నుండి 30వ తేదీ వరకు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో ఇంకా సర్వే చేయాల్సిన 119 గ్రామాల్లో రీసర్వేకు భూయజమానులు అధికారులకు సహకరించాలని కోరారు.

సముద్ర తీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

మత్స్యకారులను వేటకు అనుమతించొద్దు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - నరసాపురం

తుపాన్ ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా మారినందున మత్స్యకారులు ఎవరినీ వేటకు అనుమతించొద్దని, సముద్ర తీరానికి ఎవరినీ వెళ్లనీయకుండా చూడాలని నరసాపురం ఆర్‌డిఒ దాసి రాజు ఆదేశించారు. మంగళవారం మండలంలోని చినలంక, పిఎంలంక సముద్ర తీర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. గ్రామ సచివాలయ సిబ్బంది, విఆర్‌ఒలతో కలిసి పరిస్థితులను సమీక్షించారు. తుపాన్ తీరం దాటే వరకు సిబ్బంది అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని తమ కార్యాలయానికి అందజేయాలన్నారు. పర్యాటకులు ఎవరినీ బీచ్‌లో స్నానాలకు అనుమతించరాదన్నారు. ఆర్‌డిఒ వెంట విఆర్ మోహార్‌బాబా, సిబ్బంది పాల్గొన్నారు.

కుళ్లిన మాంసం అమ్మితే లైసెన్స్ రద్దు

మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన మాంసం, కుళ్లిన మాంసం విక్రయిస్తే ట్రేడ్ లైసెన్స్ రద్దు చేయడంతోపాటు కేసులు నమోదు చేస్తామని మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు హెచ్చరించారు. చికెన్, మటన్ దుకాణదారులతో మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మాంసాహార దుకాణదారులు ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించాలని, లేనిపక్షంలో దుకాణదారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్లాస్టిక్ నిషేధం అమల్లో ఉందని, ప్లాస్టిక్‌కు బదులుగా గుడ్డ సంచులు వాడాలని కోరారు. మాంసపు దుకాణాల వద్ద శానిటేషన్ పాటించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్, శానిటరీ సిబ్బంది, చికెన్, మటన్ షాపుల యజమానులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు

ఎస్ఆర్‌కెఆర్ క్లబ్‌కు ప్రతిష్టాత్మక అవార్డులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

అవార్డులు అందుకుంటున్న విద్యార్థులు

భీమవరం ఎస్ఆర్‌కె ఆర్ ఇంజినీరింగ్ కళాశాల టోస్ట్ మాస్టర్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ 126 విభాగంలో ప్రతిష్టాత్మక అవార్డుల ను అందుకుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు చెప్పారు. ఈ సందర్భంగా అవార్డులు అందుకున్న విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ అభినందించారు. టోస్ట్‌మాస్టర్స్ క్లబ్ డివిజన్ పినాకిల్ అవార్డు, డివిజన్ రిటెన్షన్ క్యాంప్స్ అవార్డు, డిస్ట్రిక్ట్ ఎపిక్ అవార్డు, డిస్ట్రిక్ట్ రిటెన్షన్ ఎక్సలెన్స్ డిస్ట్రిక్ట్ గోల్డెన్ క్లబ్ అవార్డుతోసహా పలు ప్రతిష్టాత్మక అవార్డులను గత మేలో హైదరాబాదులో జరిగిన డిస్ట్రిక్ట్ 126 కాంపిటీషన్స్‌లో ఈ విజయాలను అందుకున్నారు. క్లబ్ సభ్యులు కుమార్‌వర్మ పెన్మెత్స, జివి.కొండారెడ్డి అత్యుత్తమ ప్రజా సంబంధాల పనికి పిఆర్.మాస్ట్రో అవార్డును అందుకోగా, ఎస్.శ్రీసాయిపవన్, ఎం.హరీష్ ఆర్థిక నిర్వహణకు విశేషమైన కృషి చేసినందుకు ఫైనాన్షియల్ లీడర్‌షిప్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. అవార్డులు అందుకున్న విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు, ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ హెడ్ డాక్టర్ బిహెచ్‌విఎన్.లక్ష్మి తదితరులు అభినందించారు.

ఘనంగా బివి.రాజు జయంతి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సభ్యులు

శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ, డాక్టర్ బివి.రాజు ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ బివి.రాజు 104వ జయంతిని పురస్కరించుకొని భీమవరం, చుట్టుపక్కల ప్రాంతాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం కాలేజీలోని ఆయన సమాధి వద్ద విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ, బివి రాజు ఫౌండేషన్‌కు చెందిన వివిధ కళాశాలల డైరెక్టర్లు, ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. అనంతరం ప్రతిభా విద్యార్థులు 18 మందికి మెరిట్ స్కాలర్‌షిప్పులు అందజేశారు. అలాగే బివి రాజు స్వగ్రామం కుందువల్లిలో 500 మంది పేదలకు పండ్లు, బ్రెడ్లు అందజేశారు. ఫాదర్ ఎఫ్ఎంఎల్ఆర్ సెంటరు, శృంగవృక్షంలో 100 మంది లెప్రసీ రోగులకు పండ్లు అందజేశారు. మేరీస్ లెప్రసీ సెంటర్లో 250 మంది లెప్రసీ, ఎయిడ్స్, టిబి రోగులకు మందులతో పాటు బియ్యం, ఆపిల్ పండ్లు, బిస్కెట్లు అందజేశారు. అలాగే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విష్ణు క్యాంపస్ వద్ద ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 106 మంది విద్యార్థులు, సిబ్బంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు, ప్రిన్సిపల్స్, అధ్యాపక, అధ్యాపకేతర, సిబ్బంది పాల్గొన్నారు.

కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నిట్ యాజమాన్యం, విద్యార్థులు

అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలి

నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకర్‌రెడ్డి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అబ్దుల్ కలాంను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి సూచించారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దినేష్ శంకర్‌రెడ్డి మాట్లాడుతూ రక్షణ, అంతరిక్ష పరిశోధన సంస్థల్లో శాస్త్రవేత్తగా భారతదేశానికి విశిష్ట సేవలందించడంతోపాటు రాష్ట్రపతిగా దేశ పురోభివృద్ధికి పాటుపడిన మహనీయుడు అబ్దుల్ కలాం అని కొనియాడారు. ఆయన విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేశారని ప్రశంసించారు. ప్రతి విద్యార్థీ లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగితే బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని భారతదేశానికి అవసరమైన నూతన అవిష్కరణలపై దృష్టిసారించాలని వివరించారు. ముందుగా అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీన్ జిబి.వీరేష్‌కుమార్, అసోసియేట్ డీన్ డాక్టర్ వి.సందీప్, ఆచార్యులు పాల్గొన్నారు.

మొగల్తూరు : ముత్యాలపల్లి గ్రామంలోని బండి ముత్యాలమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణలో అబ్దుల్ కలాం జయంతిని ఆరోగ్య వర్షిణీ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలోని కలాం విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఛైర్మన్ నాగిడి రాంబాబు, ప్రధానోపాధ్యాయులు పెనుమత్స రామరాజు మాట్లాడారు. అబ్దుల్ కలాం శాస్త్రవేత్తగా భారత రాష్ట్రపతిగా దేశానికి ఎనలేని సేవలందించారని తెలిపారు. కార్యక్రమంలో కెఎస్‌జి.కృష్ణంరాజు, బి.శ్రీనివాసు, వి.మాధవరావు, పిడి.రాజేంద్రబాబు, దొంగ రాంప్రసాద్ పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రాధాన్యత : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - మొగల్తూరు

కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. మండలంలోని వారతిప్పలో రూ.ఐదు లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డుకు ఆయన భూమి పూజ చేశారు. మోడీలో రూ.10 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. గ్రామాలను అభివృద్ధి చేసేందుకే పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇటీవల పంచాయతీల్లో నిర్వహించిన గ్రామసభల్లో వచ్చిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదించామని, నిధులు మంజూరైన వెంటనే ఆయా పనులను చేపడతామని అన్నారు. సర్పంచి మారెళ్ల మాధవి, జనసేన మండల అధ్యక్షుడు కొల్లాటి గోపి, ఎంపిటిసి సభ్యులు తిరుమాని స్వామి, కొల్లాటి బాబూరావు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాసమూర్తి పుట్టినరోజు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

చైతన్య భారతి నాటక పరిషత్ కార్యనిర్వహణ కార్యదర్శి, కృష్ణ, మహేష్ బాబు ఫ్యాన్స్ అధ్యక్షులు రాయప్రోలు శ్రీనివాస్ మూర్తి పుట్టినరోజు వేడుకలను చైతన్య భారతి, కృష్ణ మహేష్ బాబు అభిమానుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ నిర్విఘ్నమైన సమాజ సేవకులు స్ఫూర్తి రాయప్రోలు శ్రీనివాస్ మూర్తి అన్నారు. కట్రెడ్డి సత్యనారాయణ, పాలకొల్లు చైతన్య భారతి నాటక పరిషత్ అధ్యక్షులు రాయప్రోలు భగవాన్, సభ్యులు భట్లిప్రోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ భీమవరంలో కృష్ణ విగ్రహం ప్రతిష్ఠకు రాయప్రోలు ఎంతో కృషి చేశారన్నారు. అనంతరం రాయప్రోలు శ్రీనివాస్ మూర్తిని సత్కరించారు. కార్యక్రమంలో కట్రెడ్డి సత్యనారాయణ, బొండా రాంబాబు, పేరిచర్ల లక్ష్మణ వర్మ, పెన్మెత్స శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉచిత మధుమేహ వైద్య శిబిరం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

డాక్టర్ నర్ని భవాజీ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ స్పిరిట్ సహకారంతో స్థానిక కమల హాస్పిటల్ వద్ద మంగళవారం ఉచిత మెగా డయాబెటిక్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డయాబెటిక్ స్క్రీనింగ్ టెస్ట్, ఫాస్టింగ్, పోస్ట్ మీల్ పరీక్షలు, హెచ్‌బిఎ1సి, యూరిక్ యాసిడ్, నెర్వ్ కండక్షన్ పరీక్షలు తదితర 8 రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ నర్ని భవాజీ, చిట్టాల సురేంద్ర, చిట్టాల పద్మిని, అఖిల మధుమేహానికి సంబంధించిన గుండె, చర్మం, కంటి వ్యాధులు, తిమ్మిర్లు వంటి వాటిపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, ఆహారపు అలవాట్ల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ నర్ని భవాజీ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో డయాబెటిక్ బాధితుల సంఖ్య అధికంగా పెరుగుతోందన్నారు. ఉచిత మెడికల్ క్యాంపును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ స్పిరిట్ సభ్యులు నర్ని చిన్నబాబు, ఎంఎస్.సుందర్, వీర వెంకయ్య, బత్తుల ప్రసాద్, మల్లేశ్వరరావు, మహేష్, పాండురంగారావు పాల్గొన్నారు.

కార్తీక మాసం ఏర్పాట్లపై 22న సమీక్ష

ప్రజాశక్తి - పాలకొల్లు

నవంబర్ 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే కార్తీక మాసం ఏర్పాట్ల గురించి పాలకొల్లు క్షీర రామలింగేశ్వర స్వామి ఆలయ ఇఒ ముచ్చర్ల శ్రీనివాస్ మంగళవారం నరసాపురం ఆర్డిఒ దాసి రాజుతో చర్చించారు. ఈ నెల 22న పాలకొల్లు క్షీర రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం ఏర్పాట్ల గురించి అన్ని శాఖలతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ దేవస్థానానికి జిల్లా నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద ఎత్తున యాత్రికులు విచ్చేస్తారు.

మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ అభినందనీయం

ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

మహిళల ఆత్మరక్షణ కోసం బాలికలకు ఉచితంగా మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇవ్వడం అభినందనీయమని ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. స్థానిక బ్రాంచ్ హైస్కూల్ వద్ద వన్నెంపట్ల క్యోకుషిన్ షిటోరా యు కరాటే ఫెడరేషన్ నిర్వహిస్తున్న అనేక మంది విద్యార్థినులకు ఉచిత శిక్షణ ఇస్తున్న మాస్టర్ ఎవిఎంఆర్ఆర్ ఫణి దంపతులను మంగళవారం విద్యార్థులు సత్కరించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంఎల్ఎ నాయకర్ మాట్లాడుతూ నేడు సమాజంలో బాలికలకు ఆత్మరక్షణ అత్యంత అవసరమన్నారు. అనంతరం ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జనసేన నేతలు వలవల నాని, అడ్డాల రమేష్, నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా కార్యదర్శి కొడవట్టి శివప్రసాద్, సిపిఎం పట్టణ కార్యదర్శి ముచ్చెర్ల త్రిమూర్తులు, కట్టుంగ నరేష్ పాల్గొన్నారు.

కాపు సంక్షేమ సేన జిల్లా అధ్యక్షునిగా రామకృష్ణ

ప్రజాశక్తి - వీరవాసరం

కాపు, బలిజ సంక్షేమ సేన జిల్లా అధ్యక్షుడిగా తాను ఎన్నికైనట్లు గుండా రామకృష్ణ మంగళవారం తెలిపారు. దీనికి సంబంధించిన ఎగ్జిక్యూటివ్ తీర్మానం చేగొండి హరి రామ జోగయ్య పంపారన్నారు. కాపు, బలిజ సంక్షేమానికి కృషి చేస్తానని అన్నారు. తనకు ఈ బాధ్యతలు అప్పజెప్పిన గౌరవ ప్రెసిడెంట్ బొలిశెట్టి సత్యకు, ప్రెసిడెంట్ చేగొండి హరి రామ జోగయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే జిల్లా కమిటీ వేసి కార్యాచరణకు రూపకల్పన చేస్తానన్నారు.

అధిక ధరలు అరికట్టాలని వినతి

ప్రజాశక్తి - పెనుగొండ

రెండు నెలలుగా పెరిగిన నిత్యావసరాలు, కూరగాయల ధరలు పేద, సామాన్య ప్రజలకు భారంగా మారాయని, ప్రభుత్వం ధరలను అరికట్టాలని సిపిఐ(ఎం) పెనుగొండ గ్రామ శాఖా కార్యదర్శి నాగిశెట్టి గంగారావు అన్నారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ బి.అనిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సమీక్షలు చేయడం ద్వారా ధరలు తగ్గవన్నారు. మార్కెట్లో వంట నూనె, పప్పులు, కూరగాయలు, ఉల్లిపాయల ధరలు సామాన్యులకు అందుబాటులో లేవన్నారు. నియోజకవర్గానికి ఒక రైతు బజార్ ప్రారంభించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం నిత్యావసరాల టోకు వ్యాపారంపై సమీక్షించాలని, ధరలు అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, షేక్ పాదుషా, కడలి చందు పాల్గొన్నారు.

విద్యార్థులతో ర్యాలీ

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని శ్రీహరిపేట భవిత విలీన విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం అభ్యసన సమస్యల పిల్లలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఉపాధ్యాయిని కె.శారద మాట్లాడుతూ ఉపాధ్యాయులు పిల్లల సామర్థ్యాలను పరిశీలించి సమస్య లోపం ఉన్న పిల్లలను ప్రత్యేక శిక్షణ ద్వారా అభివృద్ధిని సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డి.రమేష్, సురేఖ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ప్రజాశక్తి - పెనుగొండ

కూటమి ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తోందని ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం వడలి గ్రామంలో రూ.55 లక్షలతో, సిద్ధాంతంలో రూ.30 లక్షల వ్యయంతో పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పేదల కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలనే దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పనిచేస్తున్నారని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి సర్కార్ పంచాయతీ సొమ్ములను లూటీ చేసి దారి మళ్లించిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, సిద్ధాంతం, వడలి సర్పంచులు కాసాని విజయలక్ష్మి, చింతపల్లి గన్ని రాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - ఉండి

ఉండి 220 కెవి నుంచి యండగండి 33 కెవి విద్యుత్ ఉపకేంద్రానికి వెళ్లే 33 కెవి లైన్ల గుండా చెట్లు, కొమ్మలు తొలగించనున్న నేపథ్యంలో ఈ నెల 16వ తేదీ ఉదయం 7 నుండి 11 గంటల వరకూ యండగండి, ఉణుదుర్రు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గుర్తు తెలీని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - తణుకు రూరల్

తణుకు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మండపాక గ్రామంలోని పంట బోదెలో సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి మృతదేహం మంగళవారం లభ్యమైంది. మృతుడు టీ షర్టు, షార్ట్ ధరించి ఉన్నాడు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని తణుకు గవర్నమెంట్ హాస్పిటల్ మార్చురీలో ఉంచారు. మృతుని వివరాలు తెలిస్తే తమకు తెలియజేయాలని తణుకు రూరల్ ఎస్ఐ మూర్తి తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

స్ఫూర్తి ప్రదాత.. సద్గుణరావు

ప్రజాశక్తి - కాళ్ల

విద్యార్థులను తీర్చిదిద్దే గౌరవప్రదమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి. తరగతి గదిలో విద్యార్థులను తన సొంత బిడ్డల వలే భావించి పాఠాలు బోధించి అందరికీ స్ఫూర్తిగా నిలచారు కాళ్ల మండలం బొండాడ చినపేటకు చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు దొండపాటి సద్గుణరావు. విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పడంతోపాటు, సమాజంలో వివక్ష, అసమానతలు రూపు మాపాలని కోరుకున్న మహోన్నత వ్యక్తి దొండపాటి సద్గుణరావు మాస్టార్. ఎంతోమంది పేద విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి ఉన్నత శిఖరాలకు చేర్చిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు దొండపాటి సద్గుణరావు (85) ఇటీవల మృతి చెందారు.

భార్య, కుమారులతో కలిసి ఉన్న సద్గుణరావు (ఫైల్‌ఫొటో)

ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసే సమయంలో ప్రతిరోజూ విద్యార్థులకు స్ఫూర్తివంతమైన వ్యక్తుల కథనాల గురించి బోధించి స్ఫూర్తిదాయకంగా, మార్గదర్శకులుగా నిలవాలని సూచించేవారు. ఉపాధ్యాయులు తరగతిలో బోధించే పాఠాలతోపాటు విద్యార్థుల్లో భౌతిక వ్యక్తిత్వం, మేధో వ్యక్తిత్వం, నైతిక వ్యక్తిత్వం, ఆధ్యాత్మిక వ్యక్తిత్వం పెంపొందించేందుకు ఆయన ఎంతో కృషి చేశారు.

మాజీ ఎంఎల్‌ఎ పాతపాటి సర్రాజుతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సద్గుణరావు (ఫైల్‌ఫొటో)

బాల్యం..

పాలకోడేరు మండలం గరగపర్రు గ్రామానికి చెందిన దొండపాటి దేవదాసు - చంద్రమ్మ దంపతులకు 6వ కుమారుడిగా సద్గుణరావు ఆగష్టు 15వ తేదీ 1940లో సామాన్య కుటుంబంలో జన్మించారు. గరగపర్రులో ఒకటో తరగతి నుంచి 7వ తరగతి వరకూ ఆయన చదివారు. కాకినాడలో ప్రభుత్వ హైస్కూల్లో 8వ తరగతి నుంచి పియుసి వరకూ విద్యనభ్యసించారు. వీరి మేనమామ కట్టా రాజారావు డిప్యూటీ తహశీల్దార్‌గా పని చేశారు. పియుసి చదివిన సద్గుణరావు ఉపాధ్యాయుడు అయ్యేందుకు మేనమామ కృషి ఉంది. కాళ్ల మండలం జక్కరం గ్రామానికి చెందిన రెవరెండ్ కొనాల అహరోను రూతమ్మ ప్రథమ పుత్రిక మేరీ మెటెల్డకు సద్గుణరావుతో కొయ్యలగూడెంలో సెయింట్ పాల్ లూథరన్ చర్చిలో వివాహం జరిగింది.

ఉపాధ్యాయ వృత్తిలోకి..

22 ఏళ్లకే సద్గుణరావు ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించారు. ఆకివీడు మండలం చినకాపవరం హైస్కూల్లో మూడున్నర సంవత్సరాల పాటు పనిచేశారు. కాళ్ల మండలం కోపల్లె హైస్కూల్లో, బొండాడ చినపేట, బొండాడ యుపి, ప్రాతళ్ల మెరక ప్రాథమిక పాఠశాలల్లో, ఉండి మండలం తల్లంచెరువు ప్రాథమిక పాఠశాలలో పనిచేశారు. పెదవేగి మండలం తాళ్ల గోకవరం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా, ఉండి మండలం పాములపర్రు, వాండ్రం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేసి 1998 ఆగష్టు 31న ఉద్యోగ విరమణ పొందారు.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఆయన దిట్టాచి. కేవలం మార్కుల కోసం బోధించడం సరిపోదని, విద్యార్థి చదివింది అర్థం చేసుకుని తన భాషలో వ్యక్తం చేసేలా, సొంతంగా రాయగలగడం, రైటింగ్ స్కిల్స్ పెంపొందించడం, భాషపై పట్టు సంపాదించేలా బోధిస్తే వారు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని ఆ విధంగా విద్యార్థులను సద్గుణరావు తీర్చిదిద్దారు. ప్రతి ఒక్కరూ బాధ్యత గల పౌరులుగా ఎదగగలిగితే సమాజంలో మార్పు వస్తుంది. చదువులో రాణించనంత మాత్రాన పైకి ఎదగలేరని అనుకోవద్దని, ప్రతి విద్యార్థికీ ఏదో ఒక అంశంలో ఆసక్తి ఉంటుందని, విద్యార్థి సామర్థ్యాన్ని కేవలం మార్కులతోనే మదింపు చేయడం తగదని సూచించేవారు.

40 ఏళ్లపాటు బోధన..

40 ఏళ్ల పాటు ఉపాధ్యాయుడుగా పనిచేసి ప్రధానోపాధ్యాయుడిగా రిటైర్డ్ అయ్యారు. ఉపాధ్యాయునిగా, సామాజిక కార్యకర్తగా సమాజంలో మంచి పేరు ప్రతిష్టలు సంపాదించుకున్నారు. సద్గుణరావు ఎక్కడ పనిచేసినా ఆ పాఠశాల అభివృద్ధికి నిరంతరం తపించేవారు. మారుమూల ప్రాంతాల్లో పేద ప్రజలకు తన వంతు సేవలందించారు. నేటితరం ఉపాధ్యాయులు సద్గుణరావును ఆదర్శంగా తీసుకోవాలని పలువురు అంటున్నారు.

35 సంవత్సరాలుగా ఆధ్యాత్మిక సేవలు..

ఒకవైపు ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ.. మరోవైపు చర్చి సంఘం కాపరిగా పనిచేశారు. కాళ్ల మండలం క్రిస్టియన్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా సద్గుణరావు పనిచేశారు. బొండాడ చినపేటలో నివాసం ఏర్పాటు చేసుకున్నారు. అక్కడ సెయింట్ పాల్ లూథరన్ సంఘంలో సంఘ కాపరిగా 35 సంవత్సరాలుగా ఆధ్యాత్మికంగా సేవలందించారు. సంఘంలోనే కాకుండా ఎఇఎల్‌సిలో అనేక ఉన్నత పదవులు చేశారు. జక్కరం ప్యారిస్ డెలికేట్‌గా, ఎఇఎల్‌సి డెలికేట్‌గా, ఎన్ఎంసి ఛైర్మన్‌గా కూడా సేవలందించారు. బొండాడ క్రిస్టియన్ యూనియన్ ప్రెసిడెంట్‌గా అనేక సంవత్సరాలు పనిచేశారు. గ్రామంలోని యువతీ యువకులకు విద్య నేర్పించి, వారి భవిష్యత్తుకు పునాది వేసి వివిధ రంగాల్లో ఉద్యోగాలు పొందిందేలా తోడ్పడ్డారు.

రాజకీయ నాయకుడిగా..

ఉద్యోగ విరమణ తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. గ్రామ, మండల పార్టీ స్థాయి పదవుల్లో రాణించి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. రాజకీయాల్లో చురుగ్గా ఉండే సద్గుణరావు కాంగ్రెస్ తరపున 2004లో పాతపాటి సర్రాజు ఎంఎల్ఎ గెలుపు కోసం ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో అందరితో కలుపుగోరుగా ఉండేవారు. అంతిమయాత్రలో సద్గుణరావు చేసిన సేవలు, జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ కన్నీటి వీడ్కోలు పలికారు.

ధరల అదుపులో ప్రభుత్వాలు విఫలం

సిపిఎం జిల్లా కేంద్రం శాఖ మహాసభ విమర్శ

ప్రజాశక్తి - భీమవరం

ధరలను అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సిపిఎం జిల్లా కేంద్రం శాఖ మహాసభ విమర్శ చేసింది. భీమవరంలో సిపిఎం జిల్లా కేంద్రం శాఖ మహాసభ మంగళవారం నిర్వహించారు. ఈ సభకు గురుదాసు రఫాయేలు అధ్యక్షత వహించారు. జిల్లా కేంద్రం శాఖ మూడో మహాసభ ప్రారంభ సూచికగా ముందుగా సిపిఎం పతాకాన్ని గంగరాజు ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల మరణించిన సిపిఎం నేతలు సీతారాం ఏచూరి, బుద్ధదేవ్ భట్టాచార్య, ఆర్ఎస్, అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటాల ముందు పుష్పగుచ్ఛాలు ఉంచి జోహార్లు అర్పించారు. అనంతరం శాఖ కార్యదర్శి ఎం.ఆంజనేయులు మూడేళ్ల కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు. ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఎం జిల్లా నాయకులు కె.రాజా రామ్మోహన్ రాయ్ మాట్లాడారు. దేశంలోనూ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాలొచ్చి వంద రోజులు అయినప్పటికీ పాలకులు ధరలను అదుపు చేయడంలో విఫలమయ్యారన్నారు. ఉపాధి సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ ఉపాధిని పెంచే ఆలోచనలేమీ ఈ కాలంలో జరగలేదన్నారు. ఇప్పటికైనా పాలకులు ప్రజ సమస్యలపై దృష్టి పెట్టాలని మహాసభ డిమాండ్ చేసింది. విషజ్వరాల నివారణకై గ్రామాలు, వార్డుల్లో ప్రభుత్వం క్యాంపులు నిర్వహించి వైద్యం అందించాలని మహాసభ మరో తీర్మానాన్ని ఆమోదించింది. నూతన కార్యదర్శిగా ఆంజనేయులును తిరిగి ఎన్నుకున్నారు. సమావేశంలో రమేష్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

17 నుంచి ఉపాధి పనుల బడ్జెట్‌పై గ్రామ సభలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఉపాధి హామీ చట్టం కింద వచ్చే 2025 - 26 ఆర్థిక సంవత్సరానికి మండలంలోని 18 గ్రామాల్లో పనులు చేపట్టేందుకు బడ్జెట్ రూపకల్పన కోసం ఈ నెల 17 నుంచి 26వ తేదీ వరకూ ఆయా గ్రామ పంచాయతీల్లో సభలు నిర్వహించడం జరుగుతుందని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ బివివిఎస్.శర్మ తెలిపారు. మంగళవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులు గుర్తించి, అందుకు అవసరమైన బడ్జెట్ రూపొందించి, పంచాయతీల్లో ఆమోదం మేరకు పనులు మంజూరు చేస్తారని పేర్కొన్నారు. ఈ ప్రకారం ఈనెల 17న ఎస్ఐ పర్రు, మల్లిపూడిలో, 18న జుత్తిగ, నత్తారామేశ్వరంలో, 19న పెనుమంట్ర, గరువుల్లో, 21న మాముడూరు, పొలమూరులో, 22న వెలగలవారి పాలెం, భట్లమగుటూరులో, 23న ఆలమూరు, వెలగలేరులో, 24న నెలమూరు, ఓడూరు గ్రామాల్లో, 25న కొయ్యేటిపాడు, సత్యవరం గ్రామాల్లో, 26న మార్టేరు, నెగ్గిపూడి గ్రామాల్లో సభలు జరుగుతాయని ఆయన తెలిపారు. ఈ సభలను సంబంధిత అధికారులు, కార్యాలయ సిబ్బంది నిర్వహిస్తారని పేర్కొన్నారు.

ఉండి: ఉపాధి హామీ పనులను నిర్ధారించడానికి గ్రామసభల అవసరం ఎంతైనా ఉంటుందని టెక్నికల్ అసిస్టెంట్ లంకపల్లి ఒమేగా రాజు అన్నారు. మంగళవారం ఆరేడు, కలిగొట్ల గ్రామాల్లో ఉపాధి కూలీలకు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి గాను పనులను గుర్తించి, ఆ పనులకు ఎంత వ్యయం అవుతుందో అంచనా వేయడం జరుగుతుందని అన్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ వంద రోజులు పని దినాలు కల్పించడమే లక్ష్యంగా తాము పని చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వ్యవసాయాధికారి జ్యోషిలా

వెలగలవారిపాలెం, మల్లిపూడిలో పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని వెలగలవారిపాలెం, మల్లిపూడి గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాల్లో మండల వ్యవసాయ అధికారి ఎ.జ్యోషిలా మాట్లాడుతూ ప్రస్తుతం వరి చిరుపొట్ట దశలో ఉందని, రైతులు చివరిగా పొటాష్ ఎరువును ఎకరానికి 20 నుంచి 25 కేజీలు తప్పకుండా వేయాలని సూచించారు. అదేవిధంగా వాతావరణ మార్పులకు అనుగుణంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని, చిరుజల్లులు పడడం వల్ల బ్యాక్టీరియా, ఆకు ఎండు తెగులు, పాము పొడతెగులు ఆశించే అవకాశం ఉన్నందని తెలిపారు. అవసరమైన మేరకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామాల సర్పంచులు వెలగల సుగుణవతి, దొంగ మహాలక్ష్మి, మండల వాటర్ డిస్ట్రిబ్యూటరీ మాజీ ఛైర్మన్ వెలగల బుల్లి రామిరెడ్డి పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో అర్థకట్ల హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లో జిల్లా ఎన్‌హెచ్‌ఎం టాస్క్‌ఫోర్స్ టీం రికార్డులు, రిజిస్టర్లను మంగళవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఒ విశ్వేశ్వరప్రసాద్, ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పిల హెచ్ఎంఐఎస్, సిఎస్ఎస్ఎం ఆన్‌లైన్ డేటాను పరిశీలించి తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. డిపిహెచ్ఎన్ఒ వెంకటరత్నం, ఆర్‌సిహెచ్ పోర్టల్ ఆన్‌లైన్ డేటా పరిశీలించి తప్పులు సరిచేసి హైస్కూల్లోని 30 మంది విద్యార్థులకు, ఐదుగురు గర్భిణులకు, రక్త హీనత పరీక్షలు చేశారు. అనంతరం రక్తహీనత తక్కువగా ఉన్నవారికి పోషకాహారం, ఐరన్ మాత్రలు తీసుకోవాలని సూచించారు. గణాంకాధికారి విశ్వేశ్వరప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పిహెచ్ ఎన్‌పి.ఎలిజిబెత్, ఎస్‌కె.అమలేశ్వరరావు, డి.కమల పాల్గొన్నారు.

వికలాంగ విద్యార్థులకు అండగా భవిత కేంద్రాలు

ఎంఇఒ-2 వినాయకుడు

ప్రజాశక్తి - ఉండి

వికలాంగ విద్యార్థులకు భవిత కేంద్రాలు అండగా నిలిచాయని ఎంఇఒ-2 బొక్కా వినాయకుడు అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న ఎంపిపి స్పెషల్ పాఠశాలలో భవిత వికలాంగుల శిక్షణా కేంద్రంలో అభ్యసన సమస్యల అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఇఒ బొక్కా వినాయకుడు, ప్రత్యేక ఉపాధ్యాయుడు జి.మధుసుధాకర్ మాట్లాడారు. అభ్యాసనా సమస్యలు కలిగిన పిల్లలు ప్రతి పాఠశాలలోనూ సుమారుగా 7-10 శాతం మంది ఉంటారన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు పిల్లల లోపాలను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని తెలిపారు. వీరికి శిక్షణ ప్రతి భవిత కేంద్రంలో ప్రత్యేక ఉపాధ్యాయులచే ఇవ్వబడుతుందని, ప్రతి ఒక్కరూ గుర్తించాలని తెలిపారు. భవిత కేంద్రాల్లో పిల్లలకు వివిధ రకాల శిక్షణలు ఇస్తారని, శిక్షణ ఇవ్వడం ద్వారా పిల్లలు మానసిక స్థితి పురోగతి చెందుతుందని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌ను వినియోగించుకోండి

పిహెచ్‌సి డాక్టర్ లక్ష్మీసునంద

ప్రజాశక్తి - ఉండి

ప్రతి ఒక్కరూ ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉండి పిహెచ్‌సి డాక్టర్ పి.లక్ష్మి సునంద అన్నారు. మంగళవారం ఉండి గోరింతోటలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఉద్దేశించి లక్ష్మీసునంద మాట్లాడారు. ఆసుపత్రికి రాకుండా ప్రతి ఒక్కరికీ వారి నివాస ప్రాంతాల్లోనే ప్రభుత్వం ద్వారా ఉచితంగా చికిత్స అందించి కావాల్సిన రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. షుగర్ వ్యాధిగ్రస్తులకు, గర్భిణులకు ప్రత్యేకంగా వైద్య సదుపాయం జరుగుతుందని, అవసరమైతే మెరుగైన వైద్యం కోసం జనరల్ ఆసుపత్రికి పంపించడం జరుగుతుందని వారు వివరించారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన భట్లమగుటూరు గ్రామానికి చెందిన బాదంపూడి వర్మ, తండ్రి: వెంకటేశ్వర రావు అను నేను నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. భట్లమగుటూరులో ఇంటి దగ్గర నుండి జిరాక్స్ సెంటర్‌కి వెళుతుండగా నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. పాస్‌పోర్టు నెంబర్ **M9177412** గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

బాదంపూడి వర్మ
తండ్రి: వెంకటేశ్వర రావు, డోర్ నెం: 1-38,
అరుంధతి వీధి, భట్లమగుటూరు,
పెనుమంట్ర మండలం, ప॥గో॥జిల్లా.
సెల్: 78933 64504

సిఎం చంద్రబాబుకు చెక్కు అందజేత

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వరద బాధితుల సహాయ నిధికి రూ.83.84 లక్షల డిడిని ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ మంగళవారం ముఖ్యమంత్రి కార్యాలయంలో చంద్రబాబు నాయుడుకు అందజేశారు. తాడేపల్లిగూడెం నియోజవర్గంలో ప్రతి గ్రామం, వార్డు నుంచి తమ వంతుగా సహాయ సహకారాలు అందించిన ప్రజలందరికీ ఎంఎల్‌ఎ కృతజ్ఞతలు తెలియజేశారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ ప్రజలు దాతృత్వంలో ముందుంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గ సమస్యలపై పలు వినతి పత్రాలు అందించారు. దాదాపు రూ.100 కోట్ల ఆర్ అండ్ బి రోడ్లతో పాటు,50 కోట్ల పంచాయతీ రోడ్ల నిర్మాణానికి ఆయన అనుమతులు కోరారు. అకాల వర్షాల కారణంగా పంట నష్టం జరిగిన రైతులకు ఇన్పుట్ సబ్సిడీని సకాలంలో చెల్లించే ఏర్పాటు చేయాలని ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు విజ్ఞప్తి చేశారు. తాడేపల్లిగూడెంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు అనువైన స్థలం ఉన్నందున తాడేపల్లిగూడెంలో ఏర్పాటుకు సహకరించాలని కూడా ఆయన కోరారు. స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాడేపల్లిగూడెం నియోజకవర్గం అభివృద్ధి పనులకు పూర్తి సహకారం అందిస్తానని తెలిపారని ఎంఎల్‌ఎ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు, బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఈతకోట భీమ శంకరరావు (తాతాజీ), వాసవీ ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ గ్రంధి సత్యనారాయణ పాల్గొన్నారు.

ముత్యాలమ్మ సన్నిధిలో కొత్తపల్లి

మొగల్తూరు: ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మను మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఇఒ మేకా అరుణ్‌కుమార్ ఆయనను సత్కరించి అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదం అందించారు.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 2వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, తాడేపల్లిగూడెం

ఇ.పి.నెం.9/2024 ఇన్ ఓ.ఎస్.నెం.212/2024

బిట్వీన్:
రెడ్డి సత్యనారాయణ
...డి.హెచ్.ఆర్ /ప్లెయింటిఫ్
మద్దుకూరి నాగేశ్వరరావు
...జె.డి.ఆర్ /డిఫెండెంట్

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఆస్థి వేలం ప్రకటన

పై నెంబరు డిక్రీ బాకీ గాను ప్రతివాది /జె.డి.ఆర్ తాలూకు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థి **ది.25-10-2024 వ తేదీన ఉదయం గం॥10:30 ని॥ల లగాయతు పై కోర్టులో వేలం వేయబడును.** షరతులు తెలుసుకొని పాడుకొనవలెను.

షెడ్యూలు: పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం మండలం, జగన్నాధపురం గ్రామం తాలూకు వ్యవసాయ భూమి bearing R.S.No.115 to an extent of Ac.0-60 Cents of Agriculture land bounded by:
East: Talla Venkateswarao's Land.
South: Maddhukuri Ramarao's Land.
West: Land of Siddhina Sirisha.
North: Siddhina Venkataswararao's Land. & Etc., Land.

పై హద్దుల మధ్య య.0-60 సెంట్లు గల వ్యవసాయ భూమి సమస్త ఈజుమెంటు హక్కులతో సహా.
వాది /డి.హెచ్.ఆర్ వాల్యూ /కిమ్మత్తు : రూ.10,00,000/-
అమీనా వాల్యూ /కిమ్మత్తు : రూ.20,00,000/-

MUTYALA SUNIL KUMAR
Advocate for D.H.R.
Tadepalligude.

మహారాజశ్రీ తణుకు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో,

S.OP. 7/2024

Between:
పిటీషనరు: కూనపరెడ్డి లక్ష్మయ్య, S/o Late వీర రాఘవేంద్రరావు, వయస్సు: 54సం॥లు, జవ్వాదివారివీధి, పెనుగొండ.
మరియు
రెస్పాండెంట్లు:
1: జవ్వాది ఆదిలక్ష్మీదేవి, D/o. శ్రీరంగనాయకులు, వయస్సు: 70సం॥లు, పెనుగొండ.
2: వట్టికూటి రమా సుందరి, W/o. వెంకట సుబ్రమణ్యం, వయస్సు:67సం॥లు, డోర్ నెం: 3-10, C13/2, శాంతినగర్, కాకినాడ.

పిటీషనరు వేయించిన పేపరు ప్రకటన

పై నెంబరు గ్రంథంలో పిటీషనర్ అయిన కూనపరెడ్డి లక్ష్మయ్య తణుకు ఆంధ్రా సుగర్స్ లో గల షేర్స్ సర్టిఫికెట్లు నా క్లయింటుకు **ది. 21-08-2014సం॥ తేదీన** జవ్వాది శ్రీరంగ నాయకులు గారి భార్య లక్ష్మీ నరసాయమ్మ గారు రిజిష్టర్ వీలునామా ద్వారా సంక్రమించినందున సదరు జవ్వాది లక్ష్మీనరసాయమ్మ గారు **ది. 27-08-2018 సం॥రం తేదీన** చనిపోయినందున షేర్ సర్టిఫికెట్స్ నిమిత్తం సక్సెషన్ సర్టిఫికెట్ ఇప్పించవలసినదిగా కోరుచు పై కోర్టులో S.OP 7/2024 పిటీషను షెడ్యూలు కి సక్సెషన్ సర్టిఫికెట్ ఇప్పించ వలసిందిగా కోరుచు పిటీషను దాఖలు చేసినందున యిందుపై యావన్మంది గ్రామ ప్రజానికానికి ఏ విదమైన అభ్యంతరములు వున్నచో **ది. 23-10-2024 సం॥ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయముగా గాని, లేదా వకీలు ద్వారా గాని హాజరు అయ్యి లిఖిత పూర్వమైన ఆక్షేపణలు తెలియపర్చుకోగలరు. లేని యెడల పిటీషనరు తరపు తీర్మానించబడును. అని యిందుమూలముగా తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

మంగిన శ్రీనివాస మెహర్‌బాబా
అడ్వకేట్
తణుకు తణుకు
తేది: 10-10-2024 సెల్: 70133 18947

మహారాజశ్రీ తణుకు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో,

S.OP. 6/2024

Between:
పిటీషనరు: వట్టికూటి రమా సుందరి, W/o వెంకట సుబ్రమణ్యం, వయస్సు: 67సం॥లు, డోర్ నెం: 3-10, శాంతినగర్, కాకినాడ, Post, Mandal, Dist (AP)
మరియు
రెస్పాండెంట్లు:
R-1: జవ్వాది ఆదిలక్ష్మీదేవి, D/o. శ్రీరంగనాయకులు, వయస్సు: 70సం॥లు, పెనుగొండ, Post, Mandal, Dist (AP)
R-2: కూనపరెడ్డి లక్ష్మయ్య, S/o. (లేటు) వీరరాఘవేంద్రరావు, పెనుగొండ, Post, Mandal, Dist (AP)

పిటీషనరు వేయించిన పేపరు ప్రకటన

పై నెంబరు గ్రంథంలో పిటీషనర్ అయిన వట్టికూటి రమాసుందరి తణుకు ఆంధ్రా సుగర్స్ లో గల షేర్స్ సర్టిఫికెట్‌ని నా క్లయింటుకు **ది. 21-08-2014సం॥ తేదీన** జవ్వాది శ్రీరంగ నాయకులు గారి భార్య లక్ష్మీనరసాయమ్మ గారు వ్రాయించిన రిజిష్టర్ వీలునామా ద్వారా సంక్రమించినందున సదరు జవ్వాది లక్ష్మీనరసాయమ్మ గారు **ది. 27-08-2018 సం॥రం తేదీన** చనిపోయినందున షేర్ సర్టిఫికెట్స్ నిమిత్తం సక్సెషన్ సర్టిఫికెట్ ఇప్పించవలసినదిగా కోరుచు పై కోర్టులో S.OP 6/2024 పిటీషను షెడ్యూలు కి సక్సెషన్ సర్టిఫికెట్ ఇప్పించ గలందులకు కోరుచు పిటీషను దాఖలు చేసినందున యిందుపై యావన్మంది గ్రామ ప్రజానికానికి ఏ విదమైన అభ్యంతరములు వున్నను **ది. 23-10-2024 సం॥ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరు అయి స్వయముగా గాని, లేదా వకీలు ద్వారా గాని హాజరు అయ్యి లిఖిత పూర్వమైన ఆక్షేపణలు తెలియపర్చుకోగలరు. లేని యెడల పిటీషనరు తరపు తీర్మానించబడును. అని యిందుమూలముగా తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

మంగిన శ్రీనివాస మెహర్‌బాబా
అడ్వకేట్
తణుకు తణుకు
తేది: 10-10-2024 సెల్: 70133 18947

తాడేపల్లిగూడెం పురపాలక సంఘం

ఆర్.ఓ.సి. నెం. 492/2024/ఎ1 తేది.09-10-2024

సీల్డు టెండరు కం ఆక్షన్ నోటీసు

తాడేపల్లిగూడెం పురపాలక సంఘమునకు సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరమునకు గాను బ్రహ్మానందరెడ్డి మార్కెట్ మరియు రోడ్డు మార్జిన్లలో ఆశీలు వసూలు చేసుకుని హక్కు నిమిత్తము ది. 21-10-2024 సోమవారం ఉదయం 11.00 గంటలకు ఈ పురపాలక సంఘ కార్యాలయము నందు సీల్డు టెండరు కం ఆక్షన్ నిర్వహించబడును.

వరుస సంఖ్య	వేలం వివరము	వేలం నందు కట్టవలసిన డిపాజిట్ రూ.	వేలం నందు చెల్లించవలసిన స్టాంపు డ్యూటీ మరియు అగ్రిమెంట్ చార్జెస్ రూ.	వేలం నందు దాఖలుపరచవలసిన సాల్వెన్సీ సర్టిఫికెట్ విలువ రూ.
1	2024-25 సంవత్సరమునకు సంబంధించి అనగా ది. 01-11-2024 నుండి 31-03-2025 వరకు శ్రీ బ్రహ్మానందరెడ్డి మున్సిపల్ డైలీ & వారాంతపు మార్కెట్ మరియు రోడ్డు మార్జిన్‌ల యందు ఆశీలు వసూలు చేసుకుని హక్కు	రూ.8,00,000/-	రూ.2,00,000/-	రూ.25,00,000/-

1. సీల్డు టెండరు కం ఆక్షన్‌లో హెచ్చు పాటదారు పేరు పాట కొట్టివేయబడిన తర్వాత తిరిగి వేలం ఎక్కువ పాటకు పాడగలమని దాఖలు చేయబడిన టెండర్లు స్వీకరించబడవు. 2. సీల్డు టెండరు కం ఆక్షన్‌ను ఏ కారణము తెలుపకనే అంగీకరించుటకు గాని, నిరాకరించుటకు గాని ఎగ్జిక్యూటివ్ అధికారి వారికి పురపాలక సంఘమునకు అధికారం కలిగి ఉన్నది. 3. సీల్డు టెండరు కం ఆక్షన్‌లో పాల్గొనదలచిన వారు పాట తేదీనకు రెండు రోజులు ముందుగా సాల్వెన్సీ ధ్రువపత్రము కార్యాలయమునకు సమర్పించవలెను. 4. ఇతర వివరముల కొరకు కార్యాలయము పనిచేయు వేళలలో రెవిన్యూ విభాగం నందు తెలుసుకొనవలసిందిగా తెలియజేయడమైనది.

సం/- **కమిషనరు,** తాడేపల్లిగూడెం పురపాలక సంఘము